# COMMUNIST PARTY OF INDIA (MARXIST)
## Telangana State Committee

M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12,   Fax : 27665013,  Email-cpimtelangana@gmail.com


ప్రచురణార్థం/ ప్రసారార్థం:                                                తేది: 08.02.2021

# గుర్రంబోడులో అన్యాక్రాంతమైన భూములను గిరిజనులకే అప్పజెప్పాలి

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు తమ భూములిచ్చి త్యాగం చేసిన గిరిజన నిర్వాసితులకు అప్పటి ప్రభుత్వం గుర్రంబోడుతాండాలో భూములను కేటాయించింది. సీపీఐ(ఎం) పార్టీ నుండి జూలకంటి రంగారెడ్డి గారు ఎంఎల్ఏగా ఉన్న కాలంలో గుర్రంబోడు లిఫ్టును ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందించడం జరిగింది. వీరి సమస్యలపై సీపీఐ(ఎం) పార్టీ పోరాటం చేసింది, వారికి అండగా నిలిచింది. ప్రస్తుతం కొంతమంది రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల అండతో భూబకాసురులు ఆక్రమించి అట్టి భూముల నుండి గిరిజనులను తరమాలని చూస్తున్నారు. తక్షణమే ఇట్టి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని గిరిజనులకే అప్పజెప్పాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుని రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నది.

నాగార్జునసాగర్ ముంపులో భూమి కోల్పోయిన 100 మంది భూనిర్వాసితులకు సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంబోడు రెవెన్యూ సర్వే నంబర్ 540లో 1874ఎకరాల భూమిని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇట్టి భూమిలో గిరిజనులకు కేటాయించిన సుమారు ఐదారు వందల ఎకరాల భూముల్లో గిరిజనులు గత 70 ఏళ్ళుగా సేద్యం చేస్తూ జీవిస్తున్నారు. వీరి సమస్య పరిష్కరించకపోవడంలో ప్రభుత్వాల వైఫల్యం, గిరిజనులపై నిర్లక్ష్యం కనపడుతుంది. ప్రస్తుతం ఈ భూమి నుండి గిరిజనులను తరిమివేయాలనే కుట్రలో భాగంగా సుమారు 500 ఎకరాలు బయటివారి పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇది సేద్యానికి పనికిరాని భూమిగా పేర్కొంటూ, గిరిజనులను అక్కడి నుండి తరలించాలని చూస్తున్నారు.

ఎన్నికల సందర్భంగా మరియు నిన్న జరిగిన టీఆర్ఎస్ మీటింగ్‌లో కూడా గిరిజన భూముల సమస్యలను తానే ప్రత్యక్షంగా పాల్గొని పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి ప్రకటించారు. దీన్ని ప్రకటనకే పరిమితం చేయకుండా, గుర్రంబోడు భూములతో పాటు, రాష్ట్ర వ్యాపితంగా గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను కూడా గిరిజనులకే అప్పజెప్పి, ఆ భూములకు రక్షణ కల్పించాలని, వారి జీవనోపాధిని కొల్లగొట్టవద్దని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

**(తమ్మినేని వీరభద్రం)**
రాష్ట్ర కార్యదర్శి